క్లుప్తంగా

సీఎంను కలిసిన గోపాల్‌రెడ్డి



సీఎంతో రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, శ్రీచరణ్‌రెడ్డి

కామేపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకుడు రాంరెడ్డి శ్రీచరణ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసిన గోపాల్‌రెడ్డిని అభినందించారు. అనంతరం పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి వారు తీసుకెళ్లగా.. స్పందించి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటోట్రాలీ..

ఇద్దరికి తీవ్ర గాయాలు

కామేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. గోవింద్రాల బంజరకు చెందిన ఉప్పరి ఎల్లయ్య, షేక్ అమీర్ ఇద్దరు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కొత్తలింగాల వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో కల్వర్టు సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురుగా బల్లేపల్లికి చెందిన ఆటో ట్రాలీ వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేలకొండపల్లిలో మహిళకు..

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలోని సిరికొండ నుంచి శుక్రవారం నేలకొండపల్లికి బైక్‌పై వస్తున్న జి.సీతారావమ్మ మండలంలోని నందిగామ బ్రాంచ్ కెనాల్ సమీపానికి రాగానే ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రంథాలయానికి 500 పుస్తకాలు



పుస్తకాలు అందజేస్తున్న రోశయ్య

రఘునాథపాలెం: మండలంలోని సూర్యతండా అంబేడ్కర్ స్మారక గ్రంథాయలానికి మధిరకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రోశయ్య శుక్రవారం 500 పుస్తకాలు అందజేశారు. గ్రామానికి చెందిన యూత్ ఆధ్వర్యాన గ్రంథాలయం నిర్వహిస్తుండగా, రోశయ్య పుస్తకాలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యుడు శివలాల్, రవికుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తోలకాలను అడ్డుకున్న తహసీల్దార్

కూసుమంచి: కూసుమంచిలోని గంగాదేవి చెరువు నుంచి కొందరు అక్రమంగా మట్టిని తరలిస్తుండగా.. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈమేరకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ హెచ్చరించారు.

నృసింహస్వామికి కుంబాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం(గుట్ట)లో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి శుక్రవారం సంప్రదాయ పద్ధతిలో అర్చకులు కుంబాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో ప్రాతఃకాలార్చన, పానకాభిషేకం, విశేష పూజ, సుదర్శనయాగం, ద్వాదశ ప్రదక్షణలు, ధ్వజారోహణం, ఊంజల్ సేవ, దంపత్ తాంబూలం ఫలదానం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చర్యలు తీసుకోవాలి

కామేపల్లి: దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో దేవాదాయ భూములకు సంబంధించి కౌలు వేలాన్ని సంబంధింత అధికారులు ఇష్టారీతిగా నిర్వహిస్తున్నారని కొండాయిగూడెం పెద్ద చెరువు ఆయకట్టు మాజీ చైర్మన్ యలమద్ది అప్పారావు ఆరోపించారు. శుక్రవారం కొండాయిగూడెం రెవెన్యూ పరిధిలోని శ్రీ అంజనేయస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి భూమిని కౌలుకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించాల్సి ఉండగా.. గ్రామంలోని రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా.. సమయపాలన లేకుండా వేలం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇక ప్రత్యేకమే..!



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

కేఎంసీలో పారిశుద్ధ్యంపై నజర్

- పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం
- ఏడుగురు సూపర్‌వైజర్లు, 60 మందికి ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు
- 20 రోజుల పాటు కొనసాగనున్న ప్రత్యేక డ్రైవ్
- సమీక్షా సమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఇబ్బందిగా మారుతున్న పారిశుద్ధ్య సమస్యకు చెక్ పెట్టేందుకు కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బంది నియామకం చేపట్టింది. వర్షాకాలం ప్రారంభం కానుండగా.. ముందస్తు ప్రణాళికకు కార్పొరేషన్ సిద్ధమైంది. పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించేందుకు 60 డివిజన్లకు ఏడుగురు సూపర్‌వైజర్లు, 60 మంది ప్రత్యేక వార్డు అధికారులు, కేఎంసీ ఉద్యోగులు, అధికారులను నియమించింది. దీంతో వర్షాకాలంలో ఈసారి స్థానికులకు ఇబ్బందులు తప్పనున్నాయి.

అధికారులకు బాధ్యతలు..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వర్షాకాలం సమీపిస్తుండడంతో గత ఏడాది నెలకొన్న సమస్యలు పునరావృతం కాకుండా.. ఈసారి ముందుగానే మేల్కొంటున్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, ఇతర సమస్యలకు చెక్ పెట్టేందుకు పారిశుద్ధ్య సమస్య పరిష్కారంపై నజర్ పెట్టారు. దీనిలో భాగంగా కేఎంసీలోని డీఈలు, డీసీబీ, ఆర్‌ఓలకు సూపర్‌వైజర్ బాధ్యతలను అప్పగించడంతో పాటు నిరంతరం పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారులను ప్రత్యేక వార్డు ఆఫీసర్లుగా 60 డివిజన్లకు కేటాయించారు. సూపర్ వైజర్లు 8 నుంచి తొమ్మిది డివిజన్లకు పైగా పర్యవేక్షించనుండగా.. వార్డు ఆఫీసర్లు వారికి కేటాయించిన డివిజన్లను ప్రతిరోజు సందర్శించి పారిశుద్ధ్య పనులు పక్కాగా జరుగుతున్నాయా..? లేదా..? చూడాల్సి ఉంది. నిరంతరం జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో పారిశుద్ధ్య పనులపై వీరు సమీక్షించుకోవాల్సి ఉంటుంది.

అధికారులతో సమావేశం..

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలో భాగంగా చేపట్టబోయే కార్యక్రమాలపై కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి శుక్రవారం అధికారులతో సమావేశం అయ్యారు. డీపీఆర్‌సీ భవనంలో జరిగిన సమావేశంలో రెవెన్యూ, శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాల అధికారులు, ఉద్యోగులతో పారిశుద్ధ్య సమస్యలపై సమీక్షించారు. వర్షాకాలంలో రోడ్లపైకి మురుగు నీరు, వ్యర్థాలు రాకుండా ముందస్తుగానే డ్రైయిన్లను శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 20 రోజులపాటు అధికారులు, ఉద్యోగులు తమకు కేటాయించిన బాధ్యతలను విధిగా నిర్వర్తించాలని, ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఏడాది ఏఏ ప్రాంతాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయో గుర్తించి ఆ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆ ప్రాంతాల ప్రత్యేక అధికారులు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

చేపట్టే చర్యలివే..

సూపర్ వైజర్లు, వార్డు ఆఫీసర్లు ప్రతీ రోజు శానిటరీ జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి డివిజన్లలో పర్యటిస్తూ.. నీరు లీకేజీ ఉందా.. పారిశుద్ధ్యం సరిగా ఉందా లేదా పరిశీలించాలి. అలాగే, వర్షం కురిసిన తర్వాత డ్రెయిన్లను శుభ్రం చేశారా..? లేదా పరిశీలించాల్సి ఉంది. పరిష్కారం కాని సమస్యలు, ఇతర మిషనరీ ఏమైనా అవసరం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిని, పెరిగిన మొక్కలను తొలగించడం, అనుమతులు లేని నిర్మాణాలు, శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలి. ఇంటింటి చెత్త సేకరణను పర్యవేక్షించాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెందకుండా ముందస్తుగానే డ్రైడేను నిర్వహించేలా చర్యలు చేపట్టాలి. నగరంలోని విద్యుత్ స్తంభాలను పరిశీలించి తీగలు ఎక్కడైనా కిందకు వేలాడి ఉంటే సరిచేయించాలి. శిథిలావస్థలో ఉన్న బోర్లు, బావులకు మరమ్మతులు చేయించి, శుభ్రం చేసి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. ఖాళీ స్థలాల్లో నీటిని నిల్వ ఉంచకుండా పిచ్చి మొక్కలు పెరగకుండా చర్యలు తీసుకునేలా సంబంధిత స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలి.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించండి..



రహదారిపై చేరిన నీటి వద్ద గ్రామస్తులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం రాంక్యా తండా గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని పీవైఎల్ నాయకులు కోరారు. గ్రామంలో తాగు నీటి ట్యాంక్ గేటు వాల్ లీకేజీ కారణంగా నీరు ప్రవహిస్తున్నా గ్రామ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈసందర్భంగా పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్ ఆధ్వర్యాన గ్రామ ప్రత్యేకాధికారి భాస్కర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేసి సమస్యలను వివరించారు. దీంతో ఆయన గ్రామంలో పర్యటించి సమస్యలపై ఆరాతీసి పరిష్కారానికి హామీ ఇచ్చారు. నాయకులు ఇస్లావత్ రమేష్, కేలోత్ భజన్, అజ్మీరా ఉప్పి, రాజా, సేవాలాల్ తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' నీళ్లు రాకుండా కుట్ర..



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్

తిరుమలాయపాలెం: సీతారామ ప్రాజెక్టు జలాలు తిరుమలాయపాలెం మండలానికి రాకుండా అడ్డుకునేందుకు జరుగుతున్న కుట్రలను రైతులు తిప్పికొట్టాలని టీడీపీ నాయకుడు కొండబాల కరుణాకర్ కోరారు. మండలంలోని పాపాయిగూడెంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అశ్వాపురం వద్ద గోదావరిపై నిర్మించే ప్రాజెక్టు కాల్వ జూలూరుపాడు సమీపానికి రాగా జూలూరుపాడు నుంచి ఏన్కూరు, కామేపల్లి, కారేపల్లి మీదుగా గార్ల, డోర్నకల్ తిరుమలాయపాలెం మండలంలోకి ప్రవేశించి పాలేరు చెరువుకు అనుసంధానం కావాల్సి ఉందని తెలిపారు. కానీ ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు మల్లెంపాటి అప్పారావు నామ ప్రసాద్, కర్ణాటి అశ్వనీకుమార్, దొడ్డా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ అలీ మృతికి సంతాపం



మహబూబ్ అలీ(ఫైల్)

ఖమ్మం సహకారనగర్: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ మహబూబ్ అలీ(60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహబూబ్ అలీ మృతి సంఘానికి, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరనిలోటన్నారు. ఉపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి అని, సంఘ రాష్ట్ర ఆడిట్ కమిటీలో పనిచేస్తూ ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వి.పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

నివాళి..



సంతాప సభలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: తొలి తెలంగాణ యోధుడు కొలిశెట్టి రాందాస్, వరదాచారిల ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఖమ్మం మయూరిసెంటర్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద సంతాపసభ నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కొలిశెట్టి రాందాస్ పాత్ర కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.కాంతేశ్వరరావు, కైలాస్‌నాథ్, రామారావు, జాఫర్, సుబ్బారావు, పి.కృష్ణ, కృష్ణబాబు, దిండిగాల రాజేందర్, నర్సిరెడ్డి, రవీంద్ర, వెంకటేశ్వర్లు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రసాద్ ఆశయ సాధనకు పాటుపడాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు నల్లమల గిరిప్రసాద్ ఆశయ సాధనకు పాటు పడాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. యుక్త వయసులో రాజకీయాల్లో అడుగుపెట్టిన ఆయన నాటి సాయుధ పోరాటంలో దళ నేతగా వేలాది ఎకరాల భూ పంపిణీ చేయడంతో పాటు నాటి నిజాం రక్కసి మూకల బంధీలుగా ఉన్న గ్రామాలను విముక్తి చేశాడని ఆయన తెలిపారు. గిరిప్రసాద్ 27వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహానికి సీపీఐ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. వర్ధంతి సభలో హేమంతరావు మాట్లాడుతూ.. రాజకీయాలు భ్రష్టు పట్టి ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని ప్రస్తుత పరిస్థితుల్లో గిరిప్రసాద్ ఆదర్శాలు నిత్యం మననం చేసుకోవాలన్నారు. నేటి యువతరం గిరిప్రసాద్ పోరాట స్ఫూర్తిని తీసుకుని ప్రజా ఉద్యమ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్ సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, వీరన్న, చానా తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలి



కామేపల్లి: మాట్లాడుతున్న బానోతు సుజాత

నేలకొండపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం/కామేపల్లి: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, దివ్యాంగుల కాంగ్రెస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ కుంచం ఉప్పలయ్య, ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బానోతు సుజాత కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నేలకొండపల్లిలో నాగరాజు, కామేపల్లిలోని రాంరెడ్డి భవన్‌లో సుజాత, త్రీటౌన్‌లో జరిగిన జిల్లా వికలాంగ పట్టభద్రుల సమావేశంలో ఉప్పలయ్య మాట్లాడారు. నిరుద్యోగుల కోసం నిరంతరం శ్రమించే కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కామేపల్లి మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, రెడబోతు గోపిరెడ్డి, దొడ్డిగర్ల సుందరం, దేవండ్ల నాగేశ్వరరావు, దయానంద్, కోటి, సురేష్, శ్రీను, సుకన్య, చైతన్య, సత్తిరెడ్డి, రాయల లక్ష్మయ్య, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం..

ఖమ్మంవన్‌టౌన్: తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ.. 58వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శెట్టి రంగారావు ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేశారు. డివిజన్‌లోని పట్టభద్రులను కలిసి తమ మొదటి ప్రాధాన్యత ఓటును తీన్మార్ మల్లన్నకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు నల్లమల వేణు, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, సారబుడ్ల శ్రీనివాసరెడ్డి, నల్లమల సుధాకర్, కోటేశ్వరరావు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ హుండీని శుక్రవారం దేవాలయ కార్య నిర్వాహణాధికారి నల్లమోతు లక్ష్మయ్య సమక్షంలో లెక్కింపు చేపట్టారు. దీంతో రూ.34,556 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, పూజారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'నకిలీ'పై అప్రమత్తంగా ఉండాలి



తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చంద్ర

రఘునాథపాలెం/తిరుమలాయపాలెం/కామేపల్లి: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మండివిజన్, కూసుమంచి ఏడీఏలు అజ్మీరా శ్రీనివాసరావు, విజయ్‌చంద్ర రైతులకు సూచించారు. శుక్రవారం రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని పలు గ్రామాల్లో నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సులు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా బిల్లులు, డీలర్ సంతకం, లాట్ నంబర్ తయారీ తేదీ, గడువు తేదీలు ఉండే విధంగా చూసుకుని కొనుగోలు చేయాలని తెలిపారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనాలని, పంటకాలం పూర్తయ్యే వరకు ఖాళీ ప్యాకెట్లు భద్రపరుచుకోవాలన్నారు. కొంతమంది మోసగాళ్లు గుడ్డ సంచుల్లో నకిలీ ప్యాకెట్లలో రైతుల ఇంటివద్దకు వచ్చి విత్తనాలు అమ్ముతారని, అటువంటి వారు వచ్చినప్పుడు వ్యవసాయాధికారికి, పోలీసులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీలర్లు తమ లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని, విత్తనాలకు సంబందించిన అన్ని విధివిధానాలను పాటించాలన్నారు. అదే విధంగా జనుము, జీలుగ, పిల్లి పెసర, వంటి పచ్చిరొట్ట పైర్ల వల్ల కలిగే ఉపయోగాలు, మట్టి పరీక్ష నమూనాలను ఏ విధంగా సేకరించాలి.. వాటి ఫలితాలను తెలియజేశారు. కాగా, కొండాయిగూడెం సొసైటీలో పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేసి పచ్చిరొట్ట విత్తనాల వద్ద కలిగే ప్రయోజనాలను అజ్మీరా శ్రీనివాసరావు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల వ్యవసాయాధికారులు నారెడ్డి సీతారాంరెడ్డి, ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి , ఏఓ తారాదేవి, ఏఈఓ షేక్ మున్నీ, శ్రీకన్య, ప్రతిభ, ఉష, జగదీశ్వర్, మహేష్, సీఈఓ దొడ్డ ముత్తయ్య, షేక్ సలీమ్, రమేష్, అంబడిపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి..

రఘునాథపాలెం/నేలకొండపల్లి/కూసుమంచి: లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలు కొనాలని ఏఓలు భాస్కర్‌రావు, అరుణకుమారి, వాణిలు పేర్కొన్నారు. శుక్రవారం రఘునాథపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. లోతైన దుక్కులు దున్నడం, జనుము, జీలుగులు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్ల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పంట అవశేషాలను తగలబెట్టటం వలన జరిగే అనర్థాలను వివరించారు. వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరం ఉన్న రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డును తీసుకొని వెళ్లాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో వ్యవసాయ విస్తీరణాధికారులు దుర్గాభవానీ, అవినాష్, ఉదయ్‌కిరణ్, నిఖిల, అరవింద్, శశిరేఖ, శిరీష, రామకృష్ణ, వెంకట లీల, త్రివేణి, బుచ్చిబాబు, సాయి, వేదవ్యాస్, కార్తీక్, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సరిపడా అందించాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూసుమంచి: రైతులకు అవసరం మేరకు సరిపడా పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు శుక్రవారం ఏఓ వాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఒక్కో రైతుకు హెక్టారుకు మాత్రమే విత్తనాలు పంపిణీ చేస్తుందని, ఇట్టి విత్తనాలు రైతులకు సరిపోవడంలేదని నాయకులు పేర్కొన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాన్ని చెబుతున్న ప్రభుత్వం సరిపడా విత్తనాలు పంపిణీ చేయడం లేదన్నారు. రైతుల అవసరం మేరకు జనుములు, పిల్లిపెసర, జీలుగు విత్తనాలను సరఫరా చేయాలని, నకిలీ విత్తనాల బారిన రైతులు పడకుండా చూడాలని నాయకులు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్, నాయకులు సన్మంతరావు, గన్యా నాయక్, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి అండగా నిలవాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు


ఖమ్మంరూరల్: పాలేరు పట్టభద్రులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అండగా నిలవాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని బారుగూడెంలో జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలపై మాట్లాడే, ప్రశ్నించే గొంతుకగా రాకేష్‌రెడ్డిని శాసనమండలికి పంపించేందుకు పట్టభద్రులు ముందుకు రావాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాయమాటలు విని ఒకసారి మోసపోయారని, ఇప్పుడు అలా కాకుండా రాకేష్‌రెడ్డి ఓటు వేసి తగిని రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తెలంగాణకు, ఖమ్మం జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని, కాంగ్రెస్ వాళ్లకు అధికారం, కుర్చీలపైనే యావ ఎక్కువని, ప్రజాసమస్యలు పట్టవని తెలిపారు.అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై జీఓ నంబర్ 46 రద్దు కోసం పోరాడతానని పేర్కొన్నారు. అలాగే సమ్మేళనంలో ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఎస్‌పీ అధ్యక్షుడు ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎంపీపీ బెల్లం ఉమ, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో ఆర్జేసీ ప్రచారం..

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం ఇన్‌చార్జ్ గుండాల కృష్ణ శుక్రవారం నగరంలోని 23వ డివిజన్‌లో విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఎస్‌కె మగ్బుల్, పార్టీ నాయకులు ఇలియాస్ పాషా, సలీం, లాలా, జమాల్, అజ్జు, ఎండీ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

అవకాశవాదులను నమ్మొద్దు..



గ్రంథాలయంలో బీజేవైఎం నాయకుల ప్రచారం

ఖమ్మం మామిళ్లగూడెం: పార్టీలు మారే అవకాశవాదులను నమ్మొద్దని, నిరుద్యోగ సమస్యలపై పోరాడే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఆదరించాలని బీజేపీ జాతీయ మహిళా మోర్చా ఎగ్జిగ్యూటివ్ సభ్యురాలు, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ వీరపునేని పద్మ, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సి.మహేందర్ కోరారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని ఖమ్మం రిక్కాబజార్, బ్రాహ్మణ బజార్ తదితర ప్రాంతాలలో పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించిన సందర్భంగా పద్మ, ఖమ్మం లైబ్రరీ అండ్ స్టడీ హాల్స్‌ను సందర్శించి ఓట్లను అభ్యర్థించిన సందర్భంగా మహేందర్ మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి వేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్, చిత్తరంజన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అశోక్, ప్రధాన కార్యదర్శి ఈదుల భద్రం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్, పృథ్వీ, వినయ్, రవితేజ, విజయారెడ్డి, సరస్వతి, గోలిఫణికుమారి, నాగమణి, విష్ణు, నాగేందర్, బండారు శ్రీనివాసరావు, రాజశేఖర్, శేషాద్రి, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన..



నేలకొండపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ ఎం.యర్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27న జరిగే ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. మండలంలోని 3,081 మంది ఓటర్ల కోసం నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని.. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.